క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం పరిశీలన



మల్దకల్: మండలంలోని ఎల్కూరు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. వంట గది పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వంట ఏజెన్సీ మహిళలకు సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు అందుబాటులోకి తేవాలి



గట్టు: వర్షాకాలం నాటికి నర్సరీల్లో మొక్కలు అందుబాటులోకి వచ్చే విధంగా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ చెన్నయ్య ఆదేశించారు. గురువారం ఆరగిద్దలో నర్సరీని ఎంపీడీఓ చెన్నయ్య పరిశీలించారు. వేసవిలో మొక్కలు ఎండిపోకుండా షేడ్ నెట్ ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లోని నర్సరీలను నిరంతరం పరిశీలిస్తుండాలని సూచించారు.

ఎస్సీ రైతులు సద్వినియోగం చేసుకోండి

ఇటిక్యాల: ప్రభుత్వం షెడ్యూలు కులాల రైతులకు ఆర్థిక సహాయం అందించేందుకు గాను ఎస్సీ కార్పొరేషన్ ద్వారా బోర్‌వెల్ స్కీమ్ ప్రవేశ పెట్టినట్లు ఎంపీడీఓ అజార్ మొహియుద్దిన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సహాయం చేస్తుందన్నారు. ఆసక్తి గల రైతులు ఏప్రిల్ 2వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



గద్వాలటౌన్: మండుటెండల్లో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత ప్రారంభించారు. గురువారం స్థానిక రెండో వార్డు పరిధిలోని బీరెల్లి చౌరస్తాలో ఎస్ఆర్‌జీ గజముఖ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. చలివేంద్రాలు ఏర్పాటు చేయడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని సరిత సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్, పులిపాటి వెంకటేష్, కోటేష్, టీఎన్ఆర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల్లో నీటి సదుపాయం కల్పించాలి

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న నర్సరీల్లో మొక్కలకు తప్పకుండా నీటి సదుపాయం కల్పించాలని ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని నర్సరీని పరిశీలించారు. వేసవిలో నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ కూలీలు ఉదయం 7 గంటలకు పనులకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

విద్యార్థి సహకార క్లబ్‌లు ఏర్పాటు చేయాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని డిగ్రీ కళాశాలల్లో విద్యార్థి సహకార క్లబ్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరముందని జిల్లా సహకార అధికారి శంకరాచారి కోరారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో సహకార సంఘాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే సహకార క్లబ్ ఏర్పాటు చేశారు. అనంతరం శంకరాచారి మాట్లాడుతూ సహకార సంఘాలు వివిధ రకాల కులవృత్తులను బలోపేతం చేస్తూ.. వారు స్వయం సమృద్ధి సాధించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సహకార ఆడిట్ అధికారి టైటస్ పాల్, కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, ప్రోగ్రాం అధికారి నర్సింహులు, సహకార అధికారులు వీరభద్రయ్య, దివ్య, నాగరాజు పాల్గొన్నారు.

కూడళ్లలో కనీస వసతులేవి?



కనీస వసతులకు నోచుకోని బీచుపల్లి కూడలి

- నిరుపయోగంగా హైవే బస్‌షెల్టర్లు
- మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక అవస్థలు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ఎర్రవల్లి: నిత్యం వేలాది వాహనాలు ప్రయాణించే 44వ నంబర్ జాతీయ రహదారిపై అధికారుల నిర్లక్ష్యంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి నిర్మాణ సమయంలోనే రక్షణ చర్యలతో పాటు, వాహనాలు నిలుపుకొనుటకు పార్కింగ్ స్థలాలు, ప్రధాన కూడళ్లలో బస్‌షెల్టర్లు, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు వంటి అత్యవసరమైన కనీస వసతులను ఖచ్చితంగా కల్పించాల్సి ఉంటుంది. కానీ అలంపూర్ నియోజకవర్గంలో 44వ జాతీయ రహదారిపై కనీస వసతులు కల్పించకపోవడంతో అవస్థలు పడుతున్నట్లు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రద్దీగా కూడళ్లు..

అలంపూర్ నియోజకవర్గంలో 44వ జాతీయ రహదారి బీచుపల్లి బ్రిడ్జి నుంచి పుల్లూరు స్టేజీ వరకు సుమారు 46 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. రహదారిపై మొత్తం 25 బస్ షెల్టర్లు ఉండగా అందులో చాలా వరకు నిరుపయోగంగా ఉన్నాయి. అలాగే రహదారిపై బీచుపల్లి, ఎర్రవల్లి చౌరస్తా, కోదండాపురం స్టేజీ, పొగాకు కంపెనీ, మానవపాడు స్టేజీ, జల్లాపురం స్టేజీ, అలంపూర్ చౌరస్తా, పుల్లూరు స్టేజీ వంటి ప్రధాన కూడళ్లు ఉన్నాయి. కూడళ్ల ద్వారా నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు పలు ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. ఈ క్రమంలో కూడళ్లలో హైవే అధికారులు కనీస వసతులు కల్పించకపోవడంతో ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదని వాపోతున్నారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికుల బాధలు మాత్రం అత్యవసర పరిస్థితుల్లో వర్ణనాతీతంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నిత్యం వేలమంది ప్రయాణికులతో రద్దీగా ఉండే ఎర్రవల్లి చౌరస్తా

పట్టించుకోని అధికారులు



జాతీయ రహదారిపై ప్రయాణికులకు అవసరమైన వసతుల కల్పనలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఇట్టి విషయాన్ని పలుమార్లు హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులకు స్పందించి కూడళ్లలో ప్రయాణికులకు అవసరమైన వసతులు కల్పించాలి.

– కుర్వ ఆశన్న, ప్రయాణికుడు

కనీస వసతులు కల్పించాలి



నిత్యం వేలాది మంది ప్రయాణికులతో రద్దీగా ఉండే ఎర్రవల్లి, బీచుపల్లి, అలంపూర్ కూడళ్లలో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పార్కింగ్ స్థలాలు కూడా లేకపోవడంతో రోడ్డు పక్కన వాహనాలు నిలపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధాన కూడళ్లలో పార్కింగ్ స్థలాలతో పాటు మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటుకు హైవే అధికారులు కృషి చేయాలి.

– తెలుగు వీరేష్, వాహనదారుడు

నిరుపయోగంగా షెల్టర్లు, తాగునీటి ట్యాంకులు

జాతీయ రహదారిపై హైవే ఆధ్వర్యంలో నిర్మించిన బస్‌షెల్టర్లు, తాగునీటి ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. రహదారిపై ప్రధాన కూడళ్లలో కాకుండా కూడలికి సుమారు రెండు వందల నుంచి మూడు వందల మీటర్ల దూరంలో బస్‌షెల్టర్లు నిర్మించడంతో ఉపయోగం లేకుండా పోయాయి. అదే విధంగా బస్‌షెల్టర్ల వద్ద తాగునీటి ట్యాంకులు ఏర్పాటు చేశారు. కానీ వాటిలో నీటిని కూడా నింపకపోవడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూడళ్లలో కనీస వసతులను కల్పించాలని పలుమార్లు హైవే అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి ప్రధాన కూడళ్లపై ప్రత్యేక దృష్టి సారించి కనీస వసతులు కల్పించాలని స్థానిక ప్రజలు ప్రయాణికులు కోరుతున్నారు.

లయన్స్ క్లబ్ సేవలు విస్తరించాలి



నూతనంగా ఎన్నికైన లయన్స్ క్లబ్ జిల్లా కార్యవర్గం

గద్వాలటౌన్: జిల్లాలో లయన్స్ క్లబ్ సేవలు విస్తరించాలని లయన్స్ క్లబ్ రాష్ట్ర ప్రతినిధి హరినారాయణ్ భట్టడ్ పిలుపునిచ్చారు. స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ గురువారం జరిగిన ఎన్నిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. జిల్లాలో ప్రతి నెల క్రమం తప్పకుండా లయన్స్ సమావేశాలు ఏర్పాటు చేసి, సేవా కార్యక్రమాల నిర్వహణపై చర్చించాలన్నారు. ఈ సందర్భంగా గద్వాల జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడిగా గట్టు ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శిగా కరాటే శ్రీహరి, ఉపాధ్యక్షులుగా డాక్టర్ నళిని, ఫిజికల్ డైరెక్టర్ క్రిష్ణయ్య, క్లబ్ సర్వీస్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ మోహన్‌రావు తదితర సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు మహేంద్రకుమార్‌రెడ్డి, గాజుల శ్రీనివాసులు, అశోక్‌కుమార్ యాదవ్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు



మానవపాడులో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

మానవపాడు: మద్యం తాగి వాహనం నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చంద్రకాంత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పలు ప్రధాన కూడళ్లు, కొర్విపాడు, చంద్రశేఖర్‌నగర్ స్టేజీల్లో వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనదారులు తప్పకుండా రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయండి సారూ..

మానవపాడు: చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదని, రూ.2లక్షలకు పైగా ఉన్న రైతులు రుణాలు మాఫీ చేయాలని గురువారం జరిగిన సర్వసభ్య సమావేశంలో రైతులు వేడుకొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన మహాజన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు అంశాలు సభ దృష్టికి తీసుకొచ్చారు. సహకార సంఘంలో 3శాతం రిబేట్ ఇవ్వాలని రైతులు సభ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన అధికారులు 7శాతం వడ్డీ వసూలు చేస్తున్నామని 3శాతం రిబేట్ వచ్చిన వెంటనే రైతుల ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. దాదాపు 30 శాతం రైతులకు రుణమాఫీ కాలేదని రైతులు పేర్కొన్నారు. స్పందించిన పీఏసీఎస్ సీఈఓ ప్రభాకర్‌నాయుడు రైతుల రుణమాఫీకి సంబంధించి, పేర్లలో తప్పులు ఉన్నవాటిని నివేదిక తయారు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడు మాట్లాడుతూ.. 1-10-25 నుంచి 27-03-25 వరకు సంబంధించి అర్ధ సంవత్సర జమ ఖర్చులు ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు తెలిపారు. దీర్ఘకాలిక రుణాల్లో కర్షకమిత్ర రుణాలు రూ.10,00,000 వరకు రైతులకు ఇవ్వగలరని తీర్మానం చేశామన్నారు. గోదాం నిర్మాణం చేసేలా అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు అయ్యన్న, శంకర్‌గౌడ్, కృష్ణ, ఈరమ్మ రైతులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో చర్చిస్తున్న అధికారులు, రైతులు, సిబ్బంది

వడ్డీపై 90 శాతం రాయితీ

అయిజ: నెలాఖరులోపు ఇంటి పన్ను బకాయితో సహా చెల్లించిన వారికి వడ్డీపై 90 శాతం మినహాయింపు ఉంటుందని, వన్‌టైన్ సెటిల్‌మెంటన్‌ను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఇంటిపన్ను బకాయిపై గల వడ్డీని 90 శాతం మినహాయింపు చేస్తూ వెసులుబాటు కల్పించిందని తెలిపారు. బకాయిదారులు ఆన్‌లైన్ ద్వారా లేదా మున్సిపల్ సిబ్బందిని సంప్రదించి పన్ను చెల్లించవచ్చన్నారు. ఆస్తిపన్ను చెల్లించేందుకు మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పన్ను బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రార్థన మందిరాల్లో ప్రత్యేక పూజలు



రాజోలిలో కేక్ కట్ చేస్తున్న అభిమానులు

రాజోళి: సినీ హీరో, మెగాస్టార్ చిరంజీవి తనయుడు రాంచరణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానులు మండల కేంద్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక అంజనేయ స్వామి ఆలయంలో రాంచరణ్ పేరు మీద అర్చన, అభిషేకాలు, చర్చిలో పాస్టర్ ప్రత్యేకంగా ప్రార్థన చేసి కేక్ కట్ చేశారు. మసీదులో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు శివరామయ్య, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నిషాక్, మూగెన్న, రాము, జంగం వీరేష్, రాజు అభిమానులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంపొందించాలి



బ్యాంకులో విద్యార్థులు

ఆత్మకూర్: ఆత్మకూర్ పట్టణంలోని కేపీటీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పోలీస్ స్టేషన్, ఎస్‌బీఐ బ్యాంకులు సందర్శించారు. గురువారం పాఠశాల హెచ్ఎం అనురాధ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రభుత్వ కార్యాలయాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈసందర్భంగా ఎస్ఐ నరేందర్ పోలీసుల విధులు, చట్టాలు తదితర విషయాల గురించి అవగాహన కల్పించారు. బ్యాంకులో అధికారులు ఖాతాదారులకు అందిస్తున్న సేవల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎడ్యుకేటర్ కృష్ణయ్య, ఐఆర్పీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం అందించాలి

అయిజ: మండలంలోని వెంకటాపురం ప్రభుత్వ పాఠశాలలో కొన్ని రోజుల నుంచి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడం లేదని, ప్రతిరోజు భోజనం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. గురువారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ రాములుకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎంఈఓ అనివార్య కారణాల వలన రెండు మూడు రోజులుగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయలేదని, శుక్రవారం నుంచి తప్పనిసరిగా భోజనం ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు.



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

బాలల సంరక్షణ కోసం పాటుపడాలి

ఎర్రవల్లి: బాలల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని తహసీల్దార్ నరేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అబ్దుల్ సయ్యద్‌ఖాన్ ఆధ్వర్యంలో బాలల సంరక్షణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. బాలల చట్టాలతో పాటు వారి సమస్యలు, తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివిధ శాఖల అధికారులకు అవగాహన కల్పించారు. బాలలకు కల్పించిన హక్కులను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాల్య వివాహం జరిపిస్తే రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ. లక్ష వరకు జరిమానా ఉంటుందన్నారు. ఆపదలో ఉన్న బాల, బాలికలు ఏసమయంలోనైనా టోల్‌ఫ్రీ నంబర్ 1098ను సంప్రదించాలన్నారు. అనంతరం బాలల చట్టాలపై వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ అమీర్‌పాష, మండల వైద్యాధికారి రాధిక, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

సీసీరోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న వెంకటేష్

గట్టు: మండల పరిధిలోని మిట్టదొడ్డి గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణ పనులకు పనులకు పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్ భూమి పూజ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సుమారు రూ.15 లక్షల నిధులతో రోడ్డు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. పనులు నాణ్యతగా చేపట్టి, త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణారెడ్డి, బజారి, హనుమంతురెడ్డి, కృష్ణ, సంతోష్, మాజీ ఎంపీటీసీ శివరామిరెడ్డి, ఎల్లప్ప, నాగన్‌గౌడు, తిమ్మప్ప, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్

అయిజ: మాజీ సర్పంచ్‌లు చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో పోలీసులు మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా అరెస్ట్ చేశారు. గురువారం తెల్లవారుజామున మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గుడుదొడ్డి హనుమంతురెడ్డి, కిష్టాపురం మాజీ సర్పంచ్ సుంకన్న, మేడికొండ మాజీ సర్పంచ్ తిప్పారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.

రాజోళి: మండలంలోని ఆయా గ్రామాల మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. పెండింగ్ బిల్లుల నేపథ్యంలో అసెంబ్లీ వద్ద నిరసన చేసే కార్యక్రమం చేపట్టనున్న నేపథ్యంలో పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు మాజీ సర్పంచులు తెలిపారు.



అయిజ పోలీస్ స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



పెంచికలపాడులో ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు

గట్టు: మండల పరిధిలోని పెంచికలపాడు గ్రామంలో గురువారం ముస్లింలకు హైకోర్టు న్యాయవాది శ్రీదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా కఠిన ఉపవాసం ఉంటున్న ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఇఫ్తార్ స్వీకరించారు. కార్యక్రమంలో హాలీంపాష, రఫి, జిలాన్‌సాబ్, జమీర్, అహ్మద్, హుస్సేన్, జాఫర్, ఖాదర్ మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వం తరపున ఇఫ్తార్

మానవపాడు: మండలంలోని అమరవాయి గ్రామంలో శుక్రవారం ఇఫ్తార్ విందు ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు డీసీసీ సెక్రటరీ మహ్మద్ సిరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విందులో మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

అయిజ: మండలంలోని తూంకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అదే విధంగా 8వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 8వ తరగతి విద్యార్థులందరూ కలిసి పాఠశాల అభివృద్ధి కోసం రూ. 10 వేలు విరాళం ఇచ్చారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హెచ్ఎం జగపతిరెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



హెచ్ఎంకు విరాళం అందజేస్తున్న విద్యార్థులు

పనివేళల్లో వెసులుబాటు కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

రాజోళి: ఎండ తీవ్రత ఎక్కువవడంతో పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న పని వేళల్లో కొంత వెసులుబాటు కల్పించాలని పారిశుద్ధ్య కార్మిక సంఘం సభ్యులు అన్నారు. ఈ మేరకు గురువారం ప్రత్యేకాధికారి ఖాజా మొయినుద్దీన్‌కు మండల కేంద్రంలో వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో కార్మికులు ఉదయం నుంచి రాత్రి వరకు మురుగు కాల్వలు శుభ్రం చేయడం, వీధులు శుభ్రం చేయడం లాంటి పనులు చేస్తూనే ఉన్నారన్నారు. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు పనులు చేసుకునేలా వెసులుబాటు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు విజయ్‌కుమార్, కార్మిక సంఘం నాయకులు లక్ష్మన్న, పోలు, రాజు, మహేష, దస్తగిరి, లక్ష్మీదేవి, భీమేశ్వరి పాల్గొన్నారు.

తెలుగు పంచాంగం ఆవిష్కరణ

అయిజ: విశ్వావసు నామ సంవత్సర నూతన తెలుగు సంవత్సర పంచాంగాన్ని బీజేపీ జిల్లా నాయకుడు రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు. గురువారం పట్టణంలోని దూపదీప నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రవర్తి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామచంద్రారెడ్డి ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అర్చక సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షుడు లక్ష్మీకాంత్, అశోక్, గిడ్డయ్య, లక్ష్మణ్ గౌడ్, నరసింహ, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న రామచంద్రారెడ్డి

కోనోకార్పస్ చెట్లు తొలగించండి



వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

శాంతినగర్: వాతావరణ కాలుష్యంతో పాటు ప్రజలకు హాని కలిగిస్తున్న కోనోకార్పస్ చెట్లను తొలగించాలని కోరతూ వడ్డేపల్లి ఎంపీడీఓ రామకృష్ణకు గురువారం విద్యార్థి సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. విషపూరితమైన కోనో కార్పస్ చెట్ల వలన ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. స్పందించిన ఎంపీడీఓ ఉన్నతాధికారుల దృష్టికి సమాచారం అందజేసి వారి ఆదేశాల మేరకు చెట్లు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు బీసన్న, రవి, శేఖర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.